# ధరాఘాతం

**ఇరకాటంలో ఇంటి బడ్జెట్ • సబ్బులు, హెయిర్ ఆయిల్స్ ప్రియం**

**2 నుంచి 11 శాతం పెరిగిన రేట్లు • సామాన్యుల నెత్తిన భారం**

**ఆయా ఆహారోత్పత్తుల ధరలూ 17 శాతందాకా పైకి**



*ధరలు పెరుగుతున్నాయి. ఇంటి ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.*

*సబ్బులు, సర్ఫ్ పౌడర్ల దగ్గర్నుంచి తలంటుకునే నూనెలు, పొద్దున్నే చకచకా చేసుకు తినే నూడుల్స్‌దాకా ప్రియమైపోయాయి.*

*ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఆహార, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల రేట్లను పెంచడంతో గత 2-3 నెలలుగా నెలవారీ షాపింగ్ బిల్లులు మోత మోగిస్తున్నాయి మరి.*

న్యూఢిల్లీ, జూన్ 18: ధరల మంట మొదలైంది. సామాన్యుల ఇంటి బడ్జెట్ తలకిందులవుతున్నది. సబ్బులు, హెయిర్ ఆయిల్స్, ఆహారోత్పత్తులు అన్నింటి రేట్లనూ ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) కంపెనీలు పెంచుకుంటూపోతున్నాయి మరి. గడిచిన 2-3 నెలల్లో 2 నుంచి 17 శాతం వరకు పెరిగిన ధరలతో బిల్లులు మోత మోగిస్తున్నాయి. గత కొంత కాలంగా మౌనంగా ఉన్న సంస్థలు.. ఇప్పుడు మళ్లీ బాదుడు మొదలుపెట్టాయి. రాష్ట్ర, జాతీయ స్థాయి ఎన్నికలు ముగిసిన వేళ.. ఎఫ్ఎంసీజీల రేట్ల పెంపు ప్రస్తుతం సర్వత్రా ఆసక్తిదాయకంగా మారుతున్నది.

### ఇదీ సంగతి..

సబ్బులు, బాడీ వాష్‌ల ధరలు 2 నుంచి 9 శాతం పెరిగినట్టు తాజా లెక్కలు చూస్తే అర్థమవుతున్నది. హెయిర్ ఆయిల్స్ ధర 8 నుంచి 11 శాతం ఎగబాకగా, వివిధ రకాల ఆహారోత్పత్తుల ధరలు 3 నుంచి 17 శాతం ఎగిసినట్టు తేలింది. నిజానికి 2022, 2023 ప్రథమార్ధం వరకు ధరల్ని పెంచుతూపోయిన ఎఫ్ఎంసీజీ సంస్థలు.. ఆ తర్వాత సైలెంటైపోయాయి. ముఖ్యంగా క్రూడ్, పామాయిల్ ధరలు మార్కెట్‌లో తగ్గుముఖం పడుతున్న వేళ సబ్బుల ధరలు పెరగడం గమనార్హం. ఇక పాలు, చక్కెర, కాఫీ, కొబ్బరి, బార్లీ వంటి వాటి ధరలు కూడా విజృంభిస్తున్నాయి.

### ఇంకా పెరగొచ్చు

ఆయా ఉత్పత్తుల ధరలు ఇప్పటికే పెరిగాయని, ముమ్మందు ఇంకా పెరుగుతాయని కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సందర్భంగా ఎఫ్ఎంసీజీ దిగ్గజం మారికో.. ఏప్రిల్‌లో హెయిర్ ఆయిల్ ధరలను 6 శాతం పెంచామని, కొబ్బరి రేట్లు పెరుగుతున్నందున మళ్లీ పెరిగేందుకు వీలున్నదని సంకేతాలిచ్చింది. టాటా కన్జ్యూమర్ సైతం ఇదే దారిలో వెళ్తున్నది. డాబర్, ఇమామీ రేట్లు కొంతమేర పెరుగుతాయంటున్నాయి. మరోవైపు కూరగాయల ధరలు ఠారెత్తిస్తున్నాయి. కిలో టమాట సెంచరీ దిశగా పరుగు పెడుతుంటే, ఉల్లి హాఫ్ సెంచరీ కొట్టింది. పచ్చి మిర్చి రూ.80 పలుకుతున్నది. బెండ, దొండ ధరలూ పైపైకిపోతున్నాయి. అన్ని రకాల పప్పుల ధరలూ కిలో రూ.120 నుంచి 180 మేర పలుకుతున్నాయి.

- *వివిధ రకాల సబ్బుల ధరల్ని 4-5 శాతం పెంచిన గోద్రెజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్. డవ్ సోప్ ధరను 2 శాతం పెంచిన హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్. సంతూర్ సబ్బు ధరను 3 శాతం పెంచిన విప్రో.*
- *పెరిగిన కాల్గేట్ పామోలివ్ బాడీ వాష్ ధరలు. 4 శాతం పెరిగిన పియర్స్ బాడీ వాష్ రేటు.*
- *హెచ్‌యూఎల్ డిటర్జంట్ బ్రాండ్లు, పీఅండ్‌జీ హైజిన్-హెల్త్‌కేర్, జ్యోతీ ల్యాబ్స్ ఉత్పత్తుల రేట్లు 1 నుంచి 10 శాతం పుంజుకున్నాయి.*
- *హెచ్‌యూఎల్‌కు చెందిన షాంపూ ధరలు, స్కిన్ కేర్ ఉత్పత్తుల రేట్లు 4 శాతం వరకు ఎగిశాయి.*
- *8-13 శాతం పెరిగిన నెస్లే కాఫీ ధర. మ్యాగీ ఓట్స్ నూడుల్స్ ధర 17 శాతం ఎగిసింది. ఐటీసీ ఆశీర్వాద్ గోధుమ ధరలూ పైకెక్కాయి.*

# నేర్చుకోలేకపోతున్నారు..

**పెరుగుతున్న 'లౌడ్ లెర్నింగ్' • లింక్డ్‌ఇన్ తాజా సర్వే**

**పని, కుటుంబ ఒత్తిళ్లతో నైపుణ్యాభివృద్ధిలో వెనుకబడుతున్న ఉద్యోగులు**



న్యూఢిల్లీ, జూన్ 18: నేర్చుకోవడానికి వీలుగా మా సంస్థలు అన్ని అవకాశాలు కల్పిస్తున్నా వాటిని అందిపుచ్చుకోలేకపోతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. పని ఒత్తిళ్లు, కుటుంబ బాధ్యతల వల్లే నైపుణ్యాభివృద్ధిలో వెనుకబడుతున్నట్టు మెజారిటీ ఎంప్లాయిస్ చెప్తున్నారు. అవును.. దేశంలోని ప్రతీ 10 మంది ఉద్యోగ నిపుణుల్లో 9 మందిది ఇప్పుడిదే మాట అంటున్నది ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ లింక్డ్‌ఇన్ తాజా నివేదిక ఒకటి. మార్కెట్‌లో వస్తున్న మార్పులకు, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ ఉద్యోగులకు తర్ఫీదునిస్తూపోతున్నాయి చాలా కంపెనీలు. అయితే ఆఫీస్‌లో పని భారం, వ్యక్తిగత లేదా కుటుంబ బాధ్యతలతో సతమతమైపోతూ శిక్షణపై అత్యధిక ఉద్యోగులు దృష్టి సారించలేకపోతున్నారు. 91 శాతం ఉద్యోగులది ఇదే పరిస్థితి అని లింక్డ్‌ఇన్ తాజా అధ్యయనంలో తేలింది.

### లౌడ్ లెర్నింగ్

పని ఒత్తిడి, వ్యక్తిగత కారణాలతో కంపెనీలు ఇస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఆసక్తి చూపలేకపోతున్న ఉద్యోగులు.. తమకున్న అడ్డంకులను అధిగమించడానికి 'లౌడ్ లెర్నింగ్' మంత్రాన్ని జపిస్తున్నారు. ఆఫీసులు లేదా పనిచేసే చోట నేర్చుకోవాలన్న లక్ష్యాలపై తమకున్న ఆసక్తిని ఉద్దేశపూర్వకంగా గట్టిగా వ్యక్తపరిచే చర్యనే ఈ 'లౌడ్ లెర్నింగ్' అంటారు. ఇది తమ కెరియర్ వృద్ధికి దోహదపడగలదని ఏకంగా 79 శాతం మంది ఉద్యోగులు విశ్వసిస్తుండటం గమనార్హం. ఇక లింక్డ్‌ఇన్ సైతం ఉద్యోగ నిపుణుల కోసం కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత అత్యుత్తమ సాధనాలను అందుబాటులోకి తెచ్చింది. కాగా, అనుభవజ్ఞులైన నిపుణుల నుంచి మెంటార్‌షిప్, గైడెన్స్ అవసరమని, కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా శిక్షణ కావాలని, మారుతున్న టెక్నాలజీ, పరిస్థితులపై అవగాహనను పెంచుకోవడం తప్పనిసరి అని ఈ అధ్యయనంలో పాల్గొన్న ఎక్కువమంది ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం చాలా కంపెనీలు ఏఐ ఆధారిత సేవలు, ఉత్పాదకతపై దృష్టి పెడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున ఉద్యోగ కోతలూ జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా సర్వే ప్రాధాన్యతను సంతరించుకున్నది.

***దేశంలో ఉద్యోగాల కోసం ఇప్పుడు అవసరమైన నైపుణ్యాల్లో 2030 నాటికి 64 శాతం మారిపోవచ్చు. అందుకే ఉద్యోగులు ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని ఆహ్వానిస్తూపోవాలి. నయా టెక్నాలజీలు, నూతన అంశాలపై దృష్టి సారించి వాటిలో ఆరితేరాలి. అప్పుడే కొలువులు భద్రంగా ఉంటాయి.***

***-నిరాజితా బెనర్జీ, లింక్డ్‌ఇన్ కెరియర్ ఎక్స్‌పర్ట్***

## ఎల్ అండ్ టీకి భారీ ఆర్డర్లు

న్యూఢిల్లీ, జూన్ 18: ఎల్అండ్‌టీకి హైదరాబాద్, ముంబైల నుంచి భారీ ఆర్డర్లు లభించాయి. బిల్డింగ్స్ అండ్ ఫ్యాక్టరీస్ (బీఅండ్‌ఎఫ్) విభాగం నుంచి ఇవి వచ్చాయని సంస్థ వెల్లడించింది. ఆర్డర్ విలువ సంస్థ వెల్లడించకపోయినప్పటికీ ప్రాజెక్ట్ విలువ ఆధారంగా రూ.1,000 కోట్ల నుంచి రూ.2,500 కోట్ల మధ్యలో ఉంటుందని అంచనా.

### 'ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గవు'

ముంబై, జూన్ 18: ఇప్పట్లో వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు లేవని, సమయం వచ్చినప్పుడు రేట్లపై నిర్ణయం తీసుకుంటామని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టంచేశారు. ఈటీ నౌస్ లీడర్‌షిప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..పరపతి సమీక్షను అత్యవసరంగా మార్చాల్సిన అవసరం లేదని, ద్రవ్యోల్బణం దిగొచ్చాక, మిగతా పరిణామాలను కూడా బేరీజు వేసుకున్న తర్వాతనే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మరోవైపు ఫ్యూచర్, ఆప్షన్ ట్రేడింగ్ మార్కెట్లలో అధిక ట్రేడింగ్ గణాంకాలపై సెబీతో కలిసి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అలాగే మార్చి త్రైమాసికపు కరెంట్ ఖాతా లోటును వచ్చేవారంలో విడుదల చేస్తామన్నారు.

## న్యూయార్క్ స్థాయిలో హైదరాబాద్ వృద్ధి

**సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): అమెరికాలో స్థిరపడిన రాష్ట్ర ప్రజలు న్యూయార్క్‌తో పోల్చుకునేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉన్నదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ భౌ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎంతో భేటీ అయ్యింది. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా వృద్ధి చెందుతున్న తీరు, వివిధ రంగాలు విస్తరిస్తున్న తీరుపై వారు చర్చించారు. తమ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు రూట్ విస్తరణతో హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారుకానున్నదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తాము దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, హైదరాబాద్‌ను ప్రపంచంలో పేరొందిన నగరాల సరసన నిలబెట్టాలనేది తమ సంకల్పమన్నారు. ఈ సందర్భంగా మ్యాథ్యూ భౌ మాట్లాడుతూ.. దేశంలోనే హైదరాబాద్ శరవేగంగా వృద్ధి చెందుతున్నదని, గత ఆరు నెలల్లో రియల్టీతోపాటు ఆఫీస్ స్థలాల లీజు, నిర్మాణం, రెసిడెన్షియల్ స్పేస్‌లోనూ గణనీయమైన వృద్ధి నమోదు చేసిందన్నారు. మరోవైపు, మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో లాక్ హీడ్ మార్టిన్ కంపెనీ హెడ్ మిస్టర్ ఫర్నాండెజ్ భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో ఎన్ఎండీసీ పరిశోధన సెంటర్


హైదరాబాద్, జూన్ 18: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి ప్రభుత్వరంగ సంస్థయైన ఎన్ఎండీసీ.. తాజాగా హైదరాబాద్‌లో పరిశోధన-అభివృద్ధి కేంద్రాన్ని(ఆర్అండ్‌డీ సెంటర్) ప్రారంభించింది. ఖనిజ ఉత్పత్తి, ప్రాసెసింగ్, స్థిరమైన ఉక్కు సాంకేతికలో ఆవిష్కరణలే లక్ష్యంగా పటాన్‌చెరు వద్ద ఎనిమిది ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన సెంటర్ కోసం రూ.50 కోట్ల నిధులు వెచ్చించినట్లు కంపెనీ సీఎండీ(అదనపు) అమితావ ముఖర్జీ తెలిపారు. స్థిరమైన వృద్ధిని నమోదు చేసుకుంటున్న దేశీయ గనుల రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

# దూసుకుపోతున్న స్టాక్ మార్కెట్లు

**77 వేల పైకి సెన్సెక్స్ • 308 పాయింట్లు పుంజుకున్న సూచీ**

ముంబై, జూన్ 18: దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. బెంచ్‌మార్క్ ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తొలిసారిగా 77 వేల మార్క్‌ను అధిగమించగా, నిఫ్టీ సైతం మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నది. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలకు కిక్కునిచ్చాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 308.37 పాయింట్లు అందుకొని నూతన గరిష్ఠ స్థాయి 77,301.14 వద్ద ముగిసింది. ఇంట్రాలో 374 పాయింట్లు ఎగబాకి లైఫ్‌టైం హై 77,367 తాకి చివర్లో ఈ లాభాలను నిలుపుకోలేకపోయింది. మరో సూచీ నిఫ్టీ 92.30 పాయింట్లు ఎగబాకి రికార్డు స్థాయి 23,557.90 వద్ద స్థిరపడింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రికార్డు స్థాయి రూ.4,37,24,261.40 కోట్లు(5.24 ట్రిలియన్ డాలర్లకు) చేరుకున్నది. గత నాలుగు సెషన్లలో మదుపరుల సంపద రూ.10.29 లక్షల కోట్ల మేర పెరిగింది. సూచీల్లో పవర్ గ్రిడ్, విప్రో, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎస్బీఐ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. కానీ, మారుతి, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, టాటా మోటర్స్, ఐటీసీ, టీసీఎస్‌లు నష్టపోయాయి.

## మహీంద్రా వరి నాటే యంత్రం



ధర : 2.50 లక్షలు

హైదరాబాద్, జూన్ 18: మహీంద్రా అండ్ మహీంద్రా.. వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తెలుగు రాష్ర్టాల్లో ఆరు వరుసల వరి నాటే 6ఆర్‌వో యంత్రాన్ని ఆవిష్కరించింది. వరిసాగు సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు అత్యంత శక్తివంతమైన, సమర్థవంతమైన ఇంజిన్, అధునాతన టెక్నాలజీతో దీనిని రూపొందించింది. మహీంద్రా ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్‌తోపాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి 75 శాతం వరకు ఫైనాన్స్ లభించనున్నది.

## జోరుగా పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, జూన్ 18: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.4,62,664 కోట్ల ప్రత్యక్ష పన్నులు వసూలైనట్లు ఐటీ శాఖ వెల్లడించింది. ఈ నెల 15 నాటికి తొలి విడత అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 27.34 శాతం ఎగబాకి రూ.1.48 లక్షల కోట్లకు పెరగడం కలిసొచ్చింది.

# క్రమశిక్షణ ఉల్లంఘిస్తే వేటు

- ఇకపై ఉచిత మస్టర్ల పేరు వినపడద్దు
- ఒక్కసారి అటెండెన్స్ పడ్డాక ఆఫీస్ దాటద్దు
- సమయ పాలన పాటించని ఉద్యోగులు, అధికారులపై చర్యలు
- సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ హెచ్చరిక

గోదావరిఖని/రామగిరి, జూన్ 18: సింగరేణిలో ఉద్యోగులు, అధికారులు క్రమశిక్షణ ఉల్లంఘిస్తే వేటు తప్పదని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం హెచ్చరించారు. కంపెనీ మనుగడ సాగాలంటే పని సంస్కృతి మరింత మెరుగుపడాలని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి ఒక ప్రకటన జారీ చేశారు. కంపెనీలో కొందరు ఉద్యోగులు డ్యూటీలకు రాకున్నా మస్టర్‌పడి బయటకు వెళ్తున్నట్టు నిఘా వర్గాల ద్వారా వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయన తీవ్రంగా స్పందించారు. సింగరేణిలో ఇక నుంచి ఉచిత మస్టర్ల పేరు వినపడద్దని, ఒక్కసారి ఉద్యోగులు మస్టర్ పడిందంటే ఆఫీస్ దాటద్దని స్పష్టం చేశారు. గైర్హాజరుతో మస్టర్ పడినా, మస్టర్ అయ్యాక కార్యాలయం దాటినా ఎవరినీ ఉపేక్షించేది లేదని, సమయపాలన పాటించకున్నా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏదో ఒక కారణం చూపి కార్యాలయాలను వదిలి వరండాల్లో తిరగడం, బయటకు వెళ్లడం, కబుర్లతో కాలక్షేపం చేస్తే సంబంధిత విభాగాధిపతులపై చర్యలు ఉంటాయన్నారు. సింగరేణిలో ఉద్యోగులు, అధికారులు అంతా సమానమేనని, ఎవరికీ మినహాయింపు ఉండొదని తేల్చి చెప్పారు. కంపెనీలో తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు చేసుకోవాలని, దీనిపై ఆయా ఏరియా జీఎంలు, విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. బొగ్గు ఉత్పత్తి కోసం కార్మికులు ఎనిమిది గంటలు పని చేస్తున్నారని, వారికి సంబంధించిన సంక్షేమం, ఇతరత్రా పనులను నిర్వర్తించే ఉద్యోగులు, అధికారులు మరింత బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ఆయా ఏరియాల జీఎంలు, విభాగాధిపతులు నిరంతరం నిఘా ఉంచాలని, భూగర్భ గనుల్లో పని ప్రదేశాలను సంబంధిత అధికారులు రోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. భోజన విరామం తర్వాత నిర్ణీత సమయంలో మళ్లీ సీట్లలో కూర్చొని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సింగరేణి దవాఖానలు, డిస్పెన్సరీల్లో సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రైవేట్ రంగంతో పోటీ పడుతున్న మన సంస్థ మనుగడ సాధించాలంటే ఈ మార్పు అనివార్యమన్నారు. క్రమశిక్షణ గల సింగరేణి సంస్థగా రూపుదిద్దడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో 32 మంది ఆలస్యంగా వస్తున్నట్లు మంగళవారం రికార్డు చేశారని, సదరు ఉద్యోగుల వివరాలను సంబంధిత శాఖలకు పంపించారని, విభాగాల అధిపతులు మందలించారని తెలిపారు. ఇకపై నిరంతర ప్రక్రియగా సమయపాలనను నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# టీజీపీజీఈ సెట్‌లో సత్తా

**అడవిశ్రీరాంపూర్ విద్యార్థికి 11వ ర్యాంక్**



నిఖిల్ కృష్ణ

ముత్తారం, జూన్ 18: అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన దుబాసి నిఖిల్‌కృష్ణ టీజీపీజీఈ సెట్ ఫలితాల్లో 11వ ర్యాంక్ సాధించాడు. నిఖిల్‌కృష్ణ 2020లో జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి, ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ తాడేపల్లిగూడెంలోని బయోటెక్నాలజీ ఇంజినీరింగ్‌లో పట్టాపొందాడు. ఉన్నత చదువులు అభ్యసించడానికి టీఎస్‌పీజీ ఈసెట్ ఎంట్రెన్స్ రాశాడు. ఈ క్రమంలో మంగళవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా నిఖిల్‌కృష్ణను గ్రామస్తులు అభినందించారు. కాగా, నిఖిల్‌కృష్ణ తండ్రి రమేశ్ ప్రస్తుతం మంథని పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

# అస్తవ్యస్తం.. వెంకటాపూర్ గురుకులం

- పాఠశాలలో సమస్యల తిష్ట
- వసతుల లేమి.. అధ్వానంగా విద్యాబోధన!
- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు
- సమస్య పరిష్కారం కోసం ఆందోళన



పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వెంకటాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు

**వెంకటాపూర్‌లోని కాటారం బీసీ గురుకుల పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. కూలిపోయే గోడలు.. డోర్లు లేని బాత్‌రూమ్‌లు.. పెచ్చులూడిన తరగతి గదులతో ప్రమాదకరంగా ఉన్నది. పైగా సరైన సౌకర్యాలు లేక సుమారు 260 మంది విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. విద్యార్థుల తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం పెద్దపల్లి కలెక్టరేట్‌కు వచ్చి నిరసన తెలిపారు. వసతుల లేమి తోపాటు విద్యాబోధన కూడా బాగాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.**

పెద్దపల్లి, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : మంథని నియోజకవర్గంలోని కాటారం మండలంలో బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాల్సి ఉండేది. అయితే అక్కడ భవనం అందుబాటులో లేకపోవడంతో మంథని మండలం వెంకటాపూర్‌లో నిర్వహిస్తున్నారు. ఐదు నుంచి పదో తరగతి వరకు ఒక చోటే తరగతులు నిర్వహించాల్సి ఉండగా, గదులు సరిపోవడం లేదు. దీంతో గత విద్యా సంవత్సరం నుంచి 6, 7తరగతులను రామగుండం నియోజకవర్గంలోని సప్తగిరి కాలనీలో ఉన్న బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నారు. గతేడాది ఇంటర్ కళాశాల కూడా మంజూరు కాగా, ఈ ఇంటర్ తరగతులను పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లో ఏర్పాటు చేశారు. ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఒకేచోట చదువుకోవాల్సిన విద్యార్థులు, వేర్వేరు నియోజకవర్గాల్లో చదువుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు.

### వెంకటాపూర్‌లో సౌకర్యాలు అంతంతే

వెంకటాపూర్‌లో 5, 8, 9, 10 తరగతులు నిర్వహిస్తుండగా, 260 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఇక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడంతో నిత్యం విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. విద్యాబోధన కూడా అంతంత మాత్రంగానే ఉందని ఆరోపిసున్తున్నారు. గురుకులంలో తరగతుల బోధన, ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ, భోజన వసతితోపాటు తాగునీటి సరఫరా సరిగ్గా లేదని వాపోతున్నారు. నీళ్లచారు.. చప్పటి కూరలు.. సోడా కలిపిన ఆహారాన్ని పెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండడంతో చర్మవ్యాధులకు గురవుతున్నామని విలపిస్తున్నారు. పాములు, తేళ్ల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

### కలెక్టరేట్ వద్ద నిరసన

సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే ఒకసారి కాటారం-మంథని ప్రధాన రహదారిపై ధర్నా చేసిన వెంకటాపూర్ గురుకుల విద్యార్థులు, మంగళవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కార్యాలయం వద్ద నిరసన తెలిపి, తమ సమస్యలను ఏకరువు పెట్టారు. వెంకటాపూర్ గురుకుల పాఠశాలలలో సౌకర్యాలతో పాటు విద్యాబోధన సరిగ్గా లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి తమ గురుకులంలో వసతులు కల్పించాలని, నాణ్యమైన విద్య అందేలా చూడాలని కోరారు.

### ఇక్కడి నుంచి షిఫ్ట్ చేస్తాం

కాటారంలో సరైన భవనం దొరకకపోవడంతో ఇక్కడ ఎస్టీ ఆశ్రమ పాఠశాల ఆవరణలో గురుకుల పాఠశాలను నిర్వహిస్తున్నాం. మంచి సౌకర్యాలు ఉన్న ప్రైవేట్ భవనాల కోసం చూస్తున్నాం. అలాంటి భవనం దొరకగానే వెంటనే ఇక్కడి నుంచి షిఫ్ట్ చేస్తాం. ఆ దిశగా చర్యలు చేపడుతున్నాం. ఇక్కడ ప్రహరీతో పాటుగా సౌకర్యాలు తక్కువగా ఉన్నాయి. విద్యా భోధనకు గానీ.. ఆహారానికి సంబంధించి గానీ ఎలాంటి సమస్యల్లేవు.

**- నాగలత, ప్రిన్సిపాల్, వెంకటాపూర్ గురుకుల పాఠశాల**

### ఒక్కోసారి మంచినీళ్లు ఉండయి

మా గురుకుల పాఠశాలలో అన్నీ సమస్యలే. ఉండకని అన్నం.. నీళ్ల చారు.. చప్పటి కూరలే మాకు వేస్తరు. నీళ్లు మంచిగ ఉంటలేవు. మాకు చర్మ వ్యాధులు వస్తున్నయి. తరగతి గదులు సరిగా లేవు. ఫ్యాన్లు లేవు. మా హాస్టల్‌లో మేం తినే అన్నాన్ని ఎవరూ తినరు. వసతులు కూడా సరిగ్గా ఉండవు. మా పాఠశాలలో ఆటలు ఆడిపించరు.

**- శ్రీమాన్, శివచరణ్, విద్యార్థులు**



వెంకటాపూర్‌ని కాటారం బీసీ గురుకుల పాఠశాల

### చదువు లేదు.. సౌకర్యాల్లేవు



గురుకుల పాఠశాలల సక్కగా చదువు చెప్పుతలేరు. సౌకర్యాలు కూడా ఏం లేవు. మ్యాథ్స్, సైన్స్ అసలు చెబుతలేరు. గిట్లైతే మా పిల్లల భవిష్యత్ ఎట్ల? పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నరు. కూరలు సక్కగ లేక చాలాసార్లు నా కొడుకు ఉప్పు నీళ్లు పోసుకొని అన్నం తింటున్నడు. గింత అధ్వానంగా ఎక్కడన్నా ఉంటదా..? విద్యార్థులు అరచేతిలో ప్రాణాలను పెట్టుకొని బతుకుతున్నరు. రక్షణ లేదు. రాత్రయిందంటే అడవి పందులు తిరుగుతయి. పాములు, తేళ్లకు అయితే లెక్కే లేదు.

**- నాడెం సంధ్యారాణి, విద్యార్థి తల్లి**

# మాల్దీవుల్లో నారాయణపూర్ వాసి మృతి



చంద్రయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 18: వంతెన నిర్మాణ పనుల కోసం మాల్దీవులకు వెళ్లిన ఓ భవన నిర్మాణ కార్మికుడు అక్కడే చనిపోయాడు. పనులు చేస్తుండగానే క్రేన్ల మధ్య ఇరుక్కొని ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన శీతల చంద్రయ్య(55) గత 20 ఏండ్లుగా బొంబాయిలోని ఓ నిర్మాణ కంపనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం కంపెనీ పని మీద బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం మాల్దీవులకు వెళ్లాడు. పనులు జరుగుతున్న క్రమంలో మంగళవారం రెండు క్రేన్‌ల మధ్య ఇరుక్కుని మృతి చెందాడు. చంద్రయ్యకు భార్య పోచవ్వ, ఒక కూతురు ఉన్నారు.




పాదయాత్రలో పాల్గొన్న దళితబంధు లబ్ధిదారులు

# 'దళితబంధు' లబ్ధిదారుల పాదయాత్ర

హుజూరాబాద్, జూన్18: దళితబంధు రెండో విడుతను వెంటనే విడుదల చేయాలని ఆ పథకం హుజూరాబాద్ నియోజకవర్గ లబ్ధిదారులు డిమాండ్ చేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు పథకాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ మేరకు దాదాపు వంద మంది లబ్ధిదారులు మంగళవారం జమ్మికుంట నుంచి హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం వేలాది మందికి మొదటి విజయవంతంగా అమలు చేసిందని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో రెండో విడుత ఆగిపోయిందన్నారు. ఎన్నికల తర్వాత ఇస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని, కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. దళితబంధు సాధన సమితి హుజూరాబాద్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# నీరు తాగేందుకు వెళ్లి..

**విద్యుత్ షాక్‌తో నాలుగు ఆవులు మృతి**

కరీంనగర్‌రూరల్, జూన్ 18: నీరు తాగేందుకు వాగులోకి వెళ్లిన నాలుగు ఆవులు, ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌తో మృతి చెందాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన రైతు కోరుకంటి సత్యనారాయణ నాలుగు ఆవులను సాదుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. రోజువారీ మాదిరిగానే మేత కోసం గ్రామంలోని మానేరు వాగులోకి ఆవులను తీసుకెళ్లాడు. ఓ రైతు వాగులో వ్యవసాయ మోటర్ వేయగా, విద్యుత్ తీగలు తెగిపడిపోయాయి. ఈ క్రమంలో నీళ్లు తాగేందుకు వెళ్లిన నాలుగు ఆవులకు తీగలు తగిలి కరెంట్ షాక్ వచ్చింది. దీంతో అవి అక్కడికక్కడే చనిపోయాయి. ఒక్కో ఆవు విలువ ₹80వేలు ఉంటుందని, ఆవులు మృతి చెందడంతో జీవనోపాధి కోల్పోయామని బాధిత రైతు సత్యనారాయణ వాపోయాడు. తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.